క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 - 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

కళాసేవకుడు కొసనా వర్ధంతి రేపు

డాబాగార్డెన్స్: ఆరున్నర దశాబ్దాల పాటు కళారంగానికి సేవలందించిన కొసనా 4వ వర్ధంతి సభ ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగీతం, సాహిత్యం, నాటకం, గానం, నృత్యం వివిధ కళా అంశాలకు అహర్నిశలు సేవలందించిన కొమ్మోజు సత్యనారాయణ(కొసనా) జీవితానికి సంబంధించి వ్యాసాలు, కవితలు రాసి ఆయనకు నివాళులర్పించాలని కోరారు. కార్యక్రమానికి కవులు, రచయితలు, వివిధ సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.


'ఏయూటీడీపై కక్షసాధింపు చర్యలు'

సీతమ్మధార: యూసీడీ పీడీ కేవీ పాపునాయుడు తమ స్వచ్ఛంద సంస్థపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏయూటీడీ సంస్థ నిర్వాహకుడు ప్రగడ వాసు ఆరోపించారు. టీవీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. జీవీఎంసీతో కలిసి 14 ఏళ్లుగా ఏయూటీడీ పనిచేస్తోందని, మూడు షెల్టర్లు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రెండు షెల్టర్లలో 73 మందికి ఆశ్రయం కల్పిస్తున్నామని తెలిపారు. పాపునాయుడు ఈ నెల 23న వచ్చి రికార్డులు తీసుకెళ్లారని, అలా చేయడం సంస్థ సేవలకు ఆటంకం కలిగించడమేనన్నారు. జీవీఎంసీ కమిషనర్‌కు గతంలో ఫిర్యాదు చేశామన్న కక్షతో ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఆయనతోపాటు ఆశ్రమ మేనేజర్ జ్యోతిర్మయి, జీవీఎల్ పద్మ, కేర్ టేకర్స్ లీల, శ్రీనివాస్, భాస్కరరావు వున్నారు.

విశాఖ 'పశ్చిమ'లో సీపీఐ పోటీ

డాబాగార్డెన్స్: విశాఖలో సీపీఐ పోటీ చేయాలని నిర్ణయించిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థుల వివరాలను రాష్ట్ర నాయకత్వానికి నివేదించామన్నారు. విశాఖ పార్లమెంట్ స్థానానికి కూడా పోటీ చేసే ఆలోచన ఉందన్నారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి కార్యవర్గ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హిందీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచార సభ – చెన్నై ఆధ్వర్యంలో గత నెల ఫిబ్రవరిలో నిర్వహించిన లోయర్ పరీక్షలకు సంబంధించి సర్టిఫికెట్లను విద్యార్థులకు సోమవారం అందించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, కొక్కిరి అప్పన్న సమక్షంలో వీటిని అందించారు.

27 నుంచి ఎన్నికల ప్రచారం

- హాజరుకానున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స దంపతులు
- ఈ ఎన్నికల్లో ప్రత్యర్థుల పునాదులు కదిలిపోతాయ్
- సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రచారం ఈ నెల 27 నుంచి ప్రారంభించనున్నట్టు ఆ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వెల్లడించారు. ఆనవాయితీ ప్రకారం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ ఆలయం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రచారాన్ని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ప్రారంభించనున్నారని తెలిపారు. ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల వాసుపల్లి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచార కార్యక్రమానికి సంబంధించి పలు సూచనలు చేశారు. 35వ వార్డు నాయకుడు అలపున కనకారెడ్డి నేతృత్వంలో దుర్గాలమ్మకు కొబ్బరికాయ కొట్టి ప్రచారం ప్రారంభిస్తామన్నారు. అలాగే వార్డులో 3 రోజుల చొప్పున 14 వార్డుల్లో భారీ ప్రచారం చేపట్టనున్నట్టు చెప్పారు. ముఖ్యంగా యువకులను భాగస్వాములను చేస్తూ బైక్ ర్యాలీ ప్రతి వార్డులో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. తన ప్రచారంతోపాటు వార్డు కార్పొరేటర్లు, నాయకుల ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం కొనసాగుతాయని చెప్పారు. మే 10 వరకు ప్రచారం ముమ్మరంగా సాగనుందని వెల్లడించారు.

ఐదేళ్లు ప్రజల్లోనే ఉన్నాం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన బాటలో ఐదేళ్లు ప్రజలతోనే ఉన్నామని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ప్రజాదర్బార్ ద్వారా సమస్యలు పరిష్కరించామని, వారంలో 40 మంది రోగులను కలిసి మందుల కోసం ఆర్థిక సాయంతోపాటు భరోసా కల్పించామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు శత శాతం లబ్ధిదారులకు చేరువ చేశామని తెలిపారు. ఓటు అడిగే హక్కు మనకు మాత్రమే ఉందన్నారు. ఇప్పటికే తటస్థంగా ఉన్న కుల సంఘాల నాయకులను కలిస్తే వారు చూపించిన ఆప్యాయత, పలకరింపు కొండంత ధైర్యాన్ని ఇచ్చాయన్నారు. వైఎస్సార్ సీపీ 175 నియోజకవర్గాల గెలుపులో తొలిస్థానంలో నిలిచేది విశాఖ దక్షిణ నియోజకవర్గమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా హోలీ



వివేకానంద సేవా సంస్థలో ఒకరికొకరు రంగులు రాసుకుంటున్న వృద్ధులు



స్కూల్‌లో చిన్నారుల హోలీ సందడి

డాబాగార్డెన్స్: హోలీ పౌర్ణమి సందర్భంగా పాత నగరంలో యువత కేరింతలు కొట్టింది. రంగుల కేళీ హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా మార్వాడీలు వారి సంప్రదాయం ప్రకారం హోలీ జరుపుకుంటే.. స్థానిక యువత రంగులు జల్లుకుంటూ మునిగితేలారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచే హోలీ సందడి నెలకొంది. చిన్నా..పెద్దా తేడా లేకుండా అన్ని వయసుల వారు భాగస్వాములయ్యారు. యువత రంగులు జల్లుకుంటూ.. కోడిగుడ్లు, టమాటాలతో కొట్టుకుంటూ మిఠాయిలు తినిపించుకున్నారు. మధ్యాహ్నం వరకు నగర వీధుల్లో సందడి చేసిన యువతంతా బీచ్ స్నానాలకు పయనమైంది. సూర్యాబాగ్, స్ప్రింగ్ రోడ్డు, పూర్ణామార్కెట్, అల్లిపురం, జగదాంబ ఏరియా, మహారాణిపేట, దిబ్బలపాలెం, డాబాగార్డెన్స్, టౌన్‌కొత్తరోడ్డు, చెంగల్రావుపేట, పంజా జంక్షన్, రెల్లివీధి, జబ్బర్‌తోట, పెయిన్‌దొర పేట, థామ్సన్ స్ట్రీట్, లక్ష్మీటాకీస్ తదితర ప్రాంతాల్లో జాలీగా హోలీ జరుపుకున్నారు. జిల్లా పరిషత్ సమీపాన గల ఆల్విట్ స్కూల్‌లో చిన్నారులు సందడి చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆచారి నేతృత్వంలో నిర్వహించిన హోలీ సంబరాల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వృద్ధుల నడుమ..

వసంత పౌర్ణమి రోజున వచ్చే హోలీ పండగను వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలోని వృద్ధులు ఘనంగా జరుపుకున్నారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు వృద్ధులకు రంగులు పూసి, మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులందరూ తనకు తల్లిదండ్రుల వంటి వారన్నారు. వృద్ధులను మానసికంగా ఆనందపరచడానికి, ఉత్సాహ పరచడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సంకల్ప బలంతో మహిళల్లో మానసిక వికాసం



డాక్టర్ జయలక్ష్మిని సత్కరిస్తున్న సభ్యులు



మాట్లాడుతున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పారిష్ హాల్‌లో సెయింట్ పీటర్స్ మహిళా కమిషన్, సెయింట్ పీటర్స్ చర్చిల ఆధ్వర్యంలో సోమవారం మహిళా మానసిక వికాస ఉద్దీపన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులు పునీత పేతురు ప్రధాన చర్చి ఫాదర్ రెవరెండ్ జొన్నాడ జాన్‌ప్రకాశ్, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్‌ప్రకాశ్ మాట్లాడుతూ సహనం, సంకల్ప బలం, స్వయం నిర్ణయాత్మక శక్తి మహిళలను మానసికంగా బలోపేతం చేస్తాయన్నారు. జయలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఆడపిల్లలు మానసిక వికాసానికి సరైన ఆలోచన సరళిని అవలంబించాలని సూచించారు. అనంతరం డాక్టర్ జయలక్ష్మిని మహిళా కమిషన్ సభ్యులు శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యులు కె.మనోరంజని, నర్సింగ్ కళాశాల సిస్టర్ శోభారాణి, సేక్రెడ్ హార్ట్ పాఠశాల హెచ్ఎం సిస్టర్ సంగీత, సెయింట్ జోసెఫ్ కళాశాల ఫ్రెంచ్ ఆచార్య సిస్టర్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో నివసిస్తున్న గుంటు రత్న కొద్ది కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ మందుల ఖర్చుల నిమిత్తం సోమవారం రూ.5 వేల ఆర్థిక సాయం ఆమెకు అందించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు వేళంగిణీరావు, శ్యామ్ సుందర్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తితో శ్రీ సాయి రుద్ర హోమం

పీఎం పాలెం: స్థానిక రామాలయం వద్ద గల శ్రీసత్య సాయిబాబా ఆలయ ప్రాంగణంలో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు సాయీశ్వర రుద్ర హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హోమం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేగవంతంగా పన్నుల వసూలు



రెవెన్యూ బృందాల పనితీరును పర్యవేక్షిస్తున్న జోన్-4 కమిషనర్ ప్రసాదరావు

జగదాంబ: పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు ఆదేశించారు. 31, 35, 39 వార్డుల్లో రెవెన్యూ పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది, సెక్రటరీల పనితీరును సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గతేడాది బకాయిలతోపాటు ఈ ఏడాది చెల్లించాల్సిన పూర్తి బకాయిలను వసూలు చేసేందుకు జోన్ పరిధిలోని 12 వార్డుల్లో రెవెన్యూ సిబ్బంది, సెక్రటరీలతో సహా బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వడ్డీ లేని పన్నులు చెల్లించాలన్నారు. ఇంకా ఆరు రోజులు మాత్రమే సమయం ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పాత బకాయిదారులు, కోర్టు కేసుల్లో ఉన్న వారి ఆస్తులు తనిఖీ చేసి వసూల్ రాబట్టాలన్నారు. మొండిబకాయిదారులకు ముందస్తుగా జప్తు నోటీసులు ఇవ్వాలన్నారు. అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తులు జప్తు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పెద్ద రుసుములు చెల్లించాల్సిన వారి నుంచి బ్యాంకు చెక్‌లు తీసుకోవద్దని చెప్పారు. నేరుగా జీవీఎంసీ కమిషనర్ పేరుతో డీడీలు తీసుకోవాలన్నారు. గతంలో చెక్‌లు ఇచ్చి పన్నులు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి సెక్రటరీలు పన్ను వసూలుపై ప్రత్యేకంగా పర్యవేక్షణ జరుగుతోందని చెప్పారు. రెవెన్యూ అధికారి అప్పలరాజు, ఆర్ఐ సీతారాం, అడ్మిన్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

లోకహితుడు మాస్టర్ ఈకే



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో అతిథులు

తాటిచెట్లపాలెం: తన జీవితాన్ని సమాజ శ్రేయస్సు కోసం సమర్పించిన మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య లోకహితుడని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో ఆయన ఆధ్వర్యంలో సోమవారం మాస్టర్ ఈకే 40వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ ఈకే పుణ్యతిథిని మాస్టర్ ఈకే పూర్ణిమగా ప్రతీ ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథి ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కంభంపాటి పార్వతీకుమార్ తనయుడు కె.గురుప్రసాద్ మాట్లాడుతూ జగద్గురు పీఠం, ధనిష్టా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సుల ద్వారా వందలాది మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని, ఇది తమకెంతో సంతృప్తినిస్తోందన్నారు. జగద్గురు పీఠం ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు నిర్వహించిన టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మాస్టర్ ఈకే పూర్ణిమ సందర్భంగా 40 మంది పేద పిల్లలకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో మాస్టర్ ఈకే మనవడు, హోమియో వైద్యుడు డాక్టర్ ఎక్కిరాల అనంత్, సంస్థ సభ్యులు ఆర్.ఎస్.కృష్ణమూర్తి, గొల్లపూడి రవి కుమార్, సంస్థ నిర్వాహక సభ్యురాలు బి.ఉషారాణి, దాట్ల రాధ తదితరులు పాల్గన్నారు.

దేశంలో నియంత పాలన

డాబాగార్డెన్స్: దేశంలో నియంత పాలన నడుస్తోందని, నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ బ్యాంకు అకౌంట్ నిలిపివేయడమే అందుకు నిదర్శనమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రియాంక దండి ఆరోపించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ వంటి కేంద్ర విచారణ సంస్థలను పావుగా వాడుకొని వ్యాపారవేత్తల మీద ప్రయోగించి, ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో బీజేపీకి నిధులు అక్రమంగా సమకూర్చుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్లి సక్రమ మార్గంలో విరాళం ద్వారా సేకరిస్తున్న పార్టీ బ్యాంకు ఖాతాను నిలిపి వేయడం దుర్మార్గమన్నారు. ఇది రామరాజ్యమా.. లేక రౌడీరాజ్యమా? అని ప్రశ్నించారు. రాజ్యాంగ విరుద్ధంగా కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల నుంచి రూ.65 కోట్లు అక్రమంగా ఐటీ శాఖ తీశారన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే నాయకులను కక్ష కట్టి ఈడీ, సీబీఐని ఉపయోగించి అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వజ్జిపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలో లింగేశ్వరరావుకు బంగారు పతకాలు



గోల్డ్ మెడల్స్, షీల్డులతో లింగేశ్వరరావు

ఉక్కునగరం: జాతీయ మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బీవీఎస్‌కే లింగేశ్వరరావు రెండు బంగారు పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో హర్యానా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్ - సన్‌రైజ్ 46వ ఇండియన్ మాస్టర్స్ జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 23 వరకు జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలకు చెందిన 1,780 మంది క్రీడాకారుల పాల్గొన్నారు. లింగేశ్వరరావు డబుల్స్ 55+ కేటగిరీలో చెన్నైకు చెంది డాక్టర్ మారన్ తంగవేలుతో పోటీపడి బంగారు పతకం సాధించారు. అదే విధంగా 55+ మిక్స్‌డ్ కేటగిరీలో పూణేకు చెందిన రాజశ్రీ భావేతో పాల్గొని మరో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు బంగారు పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారుడు లింగేశ్వరరావు కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయనను ఉక్కు అధికారులు, పలువురు క్రీడాకారులు, పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ఆరోగ్య ప్రాప్తిరస్తు

- మున్సిపల్ స్టేడియంలో నూతన సౌకర్యాలు
- మహిళల కోసం ఓపెన్ జిమ్.. చిన్నారుల కోసం క్రీడా ప్రాంగణం
- రూ.15 లక్షలతో ఏర్పాటు



మున్సిపల్ స్టేడియంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు



మహిళల వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

జగదాంబ: ఆరోగ్యమే మహాభాగ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసిన విషయం తెలిసిందే. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రతి పార్కులో వ్యాయామానికి సంబంధించి పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి జిమ్‌లకు వెళ్లాల్సిన పనిలేకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, కాస్త వ్యాయామం చేసుకుని శరీర ఆకృతిని మలుచుకుంటూ ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

మహిళల కోసం ప్రత్యేకంగా..

పైసా చెల్లించకుండా కావాల్సినంత సేపు వ్యాయామం చేసుకునే అవకాశాన్ని నగర ప్రజలకు జీవీఎంసీ కల్పించింది. జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో మగవారికి జిమ్ పరికరాలు ఉన్నప్పటికీ ఆధునికీకరణలో భాగంగా మరో రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి మహిళల కోసం ప్రత్యేకంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. దీంతో పాతనగరంలోని 29, 33, 34, 35, 36, 37, 38, 39 వార్డులకు చెందిన పెద్దలు, యువత, చిన్నారులు ఇక్కడ వ్యాయామం చేసుకోవచ్చు. చిన్నాపెద్దలతోపాటు డబ్బులు ఇచ్చి ఫిజియోథెరపీ చేయించుకోలేని వారికి ఈ జిమ్‌ను వినియోగించుకోవచ్చు.

క్రీడాకారులకు అనుకూలం..

మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. స్టేడియంలో రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో క్రికెట్, కిక్‌బాక్సింగ్, బాక్సింగ్, షెటిల్, త్రోబాల్ క్రీడల్లో శిక్షణలు పొందే యువకులకు అనుకూలంగా మారింది. వీరందరూ స్టేడియానికి వచ్చిన వెంటనే కాసేపు వ్యాయామం చేసి తరువాత వారి క్రీడ శిక్షణల్లోకి వెళ్తున్నారు.

చిన్నారులకు ఆటవిడుపు..

చిన్నారులు ఆడుకోవాలంటే బీచ్ లేదా ఏదైనా పార్కుకు వెళ్లాల్సిన పరిస్థితి. తల్లిదండ్రులు వీకెండ్‌లో తప్పకుండా వారి పిల్లలను బయటకు తీసుకెళ్లి ఆటలాడిస్తుంటారు. ఇప్పుడా ఇబ్బంది లేకుండా జీవీఎంసీ మున్సిపల్ స్టేడియంలో చిన్నారుల కోసం రూ.5 లక్షలతో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. పిల్లలను ఆకట్టుకునేలా ఆట పరికరాలు అందుబాటులో ఉంచారు. పెద్దలు జిమ్, క్రీడా శిక్షణ, వాకింగ్ చేస్తూ ఆహ్లాదంగా గడుపుతుంటే.. చిన్నారుల ఆటవిడుపు కోసం ప్లే ఏరియా సిద్ధం చేశారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ జీవీఎంసీ చేపడుతున్న చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ ఉపయోగకరం



ఓపెన్ జిమ్‌లు పేదలకు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. అనారోగ్యంతో ఉండేవారు ఈ జిమ్‌లకు వచ్చి ఫిజియో చేసుకుంటున్నాం. గర్భిణులు కూడా వ్యాయామం చేసుకోడానికి వీలుగా జీవీఎంసీ పరికరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

– **సత్యవతి**, పాతనగరం, 39వ వార్డు

క్రీడాకారులకు మేలు



క్రీడలకు ముఖ్యంగా శరీరాకృతి అవసరం. మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిమ్ వల్ల వందలాది మంది క్రీడాకారులు వారి శరీర ఆకృతిని చక్కగా మలుచుకుంటున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా జిమ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– **హమీద**, 35వ వార్డు

ఆసక్తి పెరుగుతోంది



ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. పిల్లలను ప్రత్యేకంగా జిమ్‌లకు తీసుకెళ్లడం సాధ్యం కాదు. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు వల్ల పిల్లలు, వాకర్స్‌లో వ్యాయామం చేయాలనే ఆసక్తి పెరుగుతోంది.

– **రాజు**, వెలంపేట. 35వ వార్డు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు (డీఎస్ఆర్పీ), బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ జి. శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ అనంతరావులు సిబ్బందితో సోమవారం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాలను తనిఖీచేస్తుండగా బి.పవన్‌కుమార్ బ్యాగులో 3.5 కిలోల గంజాయిని గుర్తించారు. దీనికి విలువ రూ.17,500 ఉంటుందన్నారు. విశాఖ మీదుగా చెన్నైకి గంజాయి తీసుకువెళ్తున్నట్లు విచారణలో అంగీకరించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. పవన్‌ను అరెస్టు చేసిన రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్టు జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

శ్రీచైతన్య మహాప్రభు జయంతి వారోత్సవాల ముగింపు



బలరామకృష్ణులకు పుష్పాలతో అభిషేకం చేస్తున్న నిర్వాహకులు

ఆనందపురం: మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులోని హరే కృష్ణ మూవ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీచైతన్య మహాప్రభు జయంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బలరామ కృష్ణులకు అంగరంగ వైభవంగా అభిషేకాలు, హోళికా దహనం, మహా మంగళ హారతి, పుష్పాలతో హోలీ ఉత్సవం నిర్వహించారు. నగరంలోని వివిధ గృహాల్లో పూజించిన 100 నితాయి గౌరంగ విగ్రహాలను తీసుకొచ్చి పూజ చేసే విధానం వివరించారు. 1486లో పశ్చిమ బెంగాల్‌లో శ్రీకృష్ణ చైతన్య మహా ప్రభు అవతరించారన్నారు. హరేకృష్ణ మహామంత్రంతో కూడిన హరి నామ సంకీర్తనను భారతదేశమంతటా ప్రచారం చేశారన్నారు. కార్యక్రమంలో అంబరీష దాస, తదితరులు పాల్గొన్నారు.